## క్లుప్తంగా

### గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ పందిర్ల వినోద

రెబ్బెన: గ్రామాల అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని గంగాపూర్ సర్పంచ్ పందిర్ల వినోద మధునయ్య అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి పలు అభివృద్ధి పనులపై వార్డు సభ్యులతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అదే సతీష్, వార్డు సభ్యులు శంకర్, సత్యమ్మ, ముంజం వినోద్, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పాల్గొన్నారు.

### బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలని సీఆర్పీ గంథం ప్రకాశ్ అన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో బడి బయటి పిల్లల సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ ముత్తంపేట్ కాంప్లెక్స్ పరిధిలోని వీరవెల్లి, కుంబారీ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బడి బయట పిల్లల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

### రేపు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు రాజశేఖర శర్మ తెలిపారు. ఆలయంలో ఉదయం 9.00 గంటలకు పూజలు, అభిషేకం, అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### నేడు జాతర వేలం

వాంకిడి: మహా శివరాత్రి పురస్కరించుకుని మండల కేంద్రంలో నిర్వహించే జాతరకు నేడు (ఆదివారం) వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు శివాలయంలో నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

### అండర్‌పాస్ నిర్మించాలని వినతి

వాంకిడి: నాలుగు వరుసల రహదారి పనుల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్మించే వెహికల్ అండర్‌పాస్ జెడ్పీ పాఠశాల ఎదుట నిర్మించాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఎన్‌హెచ్ఏఐ అథారిటీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థినులకు కరాటే శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో ఉచిత కరాటే శిక్షణ అందించనున్నట్లు డీఈవో అశోక్ తెలి పారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీ వరకు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్ష పరిరక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలు, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు ఉచితంగా నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో రూ.5వేలు అందిస్తారని పేర్కొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి షరీనా అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో ఉన్నతంగా ఎదగవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడాలన్నారు. పోక్సో వంటి చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజిరెడ్డి, కిషోర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### దీక్షాపరుల ప్రత్యేక పూజలు

కౌటాల: మండలంలోని వైగాం గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో జంగుబాయి దీక్షాపరులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగోబాకు ఘనంగా పూజలు

దేవతలకు పూజలు చేస్తున్న కటోడాలు



నైవేద్యం సమర్పిస్తున్న కటోడాలు



గంపలోని దేవతలకు మొక్కుతున్న భక్తులు



కెరమెరి మండలంలోని గోండ్ కరంజివాడలో నాగోబాకు శనివారం భక్తులు అత్యంత ఘనంగా పూజలు నిర్వహించారు. 27 ఏళ్ల నుంచి ప్రతీ ఏటా నాగోబాకు పూజలు చేస్తున్నారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా, పాండర్‌కవ్డా తాలుకాలకు చెందిన సుమారు 400 గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుమురుం బొజ్జు పటేల్ ఇంట్లో కొలువైన నాగోబాకు మొక్కులు చెల్లించారు. వడ్లబియ్యం, కొబ్బరికాయలు, పాలు, పెరుగు, బెల్లం, గోధుమలు, ఆవునూనె సమర్పించారు. పెద్దలు, కటోడాలు బొజ్జు, గాగ్రు, సీతారాం, కోసు, విజయ్, మారుతి, దౌలత్‌రావు తదితరులు ఉన్నారు.

- కెరమెరి



అటుకులు, పుట్నాలు సమర్పిస్తున్న భక్తులు



పవిత్ర గంగాజలానికి పూజ చేస్తున్న భక్తులు



దేవుళ్లతో ఆలయంలోనికి వెళ్తున్న మహిళలు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

# మహిమల స్వామి 'వెంకన్న'



అనార్‌పల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం

- రేపటి నుంచి అనార్‌పల్లిలో బ్రహ్మోత్సవాలు
- ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తుల రాక



స్వామి వారి రథం

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లిలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే జాతరను ఈ ఏడాది కూడా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, మహారాష్ట్ర నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకోనున్నారు. ఆలయంలోని వేంకటేశ్వర స్వామి, లక్ష్మీపద్మావతి, లక్ష్మీవినాయకుడు, గరుడ, కుర్మ, ఆంజనేయ స్వామి దేవతామూర్తులకు ఘనంగా పూజలు చేయనున్నారు.

### జాతర ఘనంగా నిర్వహిస్తాం



వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా అన్నమయ్య సంకీర్తన ఉంటుంది. బృందం ద్వారా నాదస్వరం, కోలాటం నిర్వహిస్తాం. గతం కంటే ఈసారి జాతర ఘనంగా నిర్వహిస్తాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందాలి. **- బాదావత్ ధన్‌రాజ్, ఆలయ అర్చకుడు**

**1988లో నిర్మాణం..**

ప్రజల నుంచి విరాళాలు సేకరించి 1988లో అనార్‌పల్లిలో వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా స్వామివారి పేరిటా జాతర, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ధర్మాచారులు నేడు స్వామి వారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, కుంకుమ తీసుకు రానున్నారు. 2013 నుంచి మన గుడి కార్యక్రమాలు కొనసాగుతుండగా, ప్రతీ సంవత్సరం టీటీడీ నుంచి పట్టువస్త్రాలు, కుంకుమ, కంకణం, పూజా సామగ్రి అందుతోంది.

**నిర్వహించే కార్యక్రమాలు..**

ఉదయం 5.30 గంటలకు స్వామివారికి అలంకరణ, మగ్‌బీచ్ చంద్రదర్శనం, 6.30 గంటలకు అభిషేకం, 8.00 గంటలకు ధ్వజారోహణ, 11.15 గంటలకు స్వామి వారి కల్యాణం అనంతరం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 3:00 గంటలకు స్వామి వారి రథం ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బాదావత్ ధన్‌రాజ్, నిర్వాహకులు బాదావత్ జగదీశ్, బాదావత్ ప్రకాశ్ నాయక్ తెలిపారు.

# నాగోబాకు జెడ్పీటీసీల పూజలు



నాగోబాకు పూజలు చేస్తున్న జెడ్పీటీసీలు

కెరమెరి: మండలంలోని పెద్ద కరంజివాడలో కొలువైన నాగోబాకు శనివారం కెరమెరి, సిర్పూర్(యూ) జెడ్పీటీసీలు సెడ్మకి దుర్పతబాయి, కోవ అరుణలు పూజలు చేశారు. ఆలయంలోని నాగోబా, దుర్గాదేవి, కొటోడే దేవికి మొక్కులు చెల్లించారు. అనంతరం పాము పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కుమురం బొజ్జు, విజయ్, రాంచందర్, కేంద్రె బాలాజి, మారుతి తదితరులు ఉన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందిస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన ముత్తంపేట జట్టు, కౌటాల జట్లకు బహుమతులతో పాటు నగదు అందించారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ఉప సర్పంచ్ వెంకటేశ్, సంఘం డివిజన్ అధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు నికాడే గంగారం, నాయకులు నాందేవ్, అంజన్న, శ్రీనివాస్, గణేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

**కబడ్డీ పోటీలు ప్రారంభించిన ఎంపీపీ**

కెరమెరి: మండలంలోని చాల్‌బాడి గ్రామంలో కబడ్డీ పోటీలను శనివారం ఎంపీపీ పెందోర్ మోతీరాం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటల్లో మక్కువ చూపాలన్నారు. సర్పంచ్‌లు మానిక్‌రావు, న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, నాయకులు భరత్‌భూషణ్, ఎల్లయ్య, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సిర్పూర్(టి): గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని చీలపల్లి గ్రామంలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంట చేలల్లో వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్తు తీగలు అమర్చినా, గుడుంబా తయారీ, విక్రయాలు జరిపినా, బాల్య వివాహాలు వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య యాదవ్, గ్రామస్తులు లింగమూర్తి, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

# కొండపల్లిలో అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని గ్రామస్తులకు సూచించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం అందించాలన్నారు.

**సెయింట్ క్లారెట్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్**

మండలంలోని ఎల్లూర్ గ్రామంలో గల సెయింట్ క్లారెట్ పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఎస్సై విజయ్‌కుమార్ విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్, ప్రిన్సిపాల్ అనిష్, సర్పంచ్ ఉపాసీ సంజీవ్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

బెజ్జూర్: మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామానికి చెందిన బూస లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా గ్రామ యువకులు బాధితురాలి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. బాధితురాలి పరిస్థితి వివరిస్తూ మండల బీఆర్ఎస్ నాయకుడు జావిద్ అలీ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీంతో పలువురు స్పందించి ఆర్థిక సాయం చేయగా శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యుడు రమేష్, యూత్ సభ్యులు శ్రీకాంత్, వెంకటేష్, నాగేష్, ధనుంజయ్, చిరు, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి ఉద్యోగం సాధించాలి



నార్నూర్: వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



స్టడీ సర్కిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న పోలీసు, గ్రూప్ 4, టీఆర్‌టీ అభ్యర్థులకు శనివారం పలు సూచనలు చేశారు. స్టడీ సర్కిల్ అధ్యాపకులు ఉషన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.

**గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి**

నార్నూర్: గాదిగూడ మండలంలోని రోమస్‌కాసా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం గ్రామస్తులు, పేర్సాపేన్ సంక్షేమ సంఘం నాయకులు కుమురంభీం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పేర్సాపేన్ ఆలయ ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు మంజూరు చేయాలన్నారు.

# వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: వ్యవసాయ శాఖ ప్రాధాన్యతను తెలియజేస్తూ రూపొందించిన క్యాలెండర్, డైరీని శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ తన చాంబర్‌లో ఆ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం గడలపల్లి పంచాయతీ పరిధిలోని పవన్‌మడుగు ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం గడలపల్లి గ్రామంలో నిర్వహించిన గోండి ధర్మ గురువు పహాండి కూపర్ లింగో జెండా ముట్టి పూజా కార్యక్రమాన్ని వారు హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూపర్ లింగో జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, జిల్లా సార్‌మెడి కుర్సెంగ మోతీరాం, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచ్ మడావి గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని ఖమాన పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ పెందూర్ పవన్, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్‌కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కును వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం నుంచి ఖమాన వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతోపాటు మధ్యలో వాగు నిర్మించాలని కోరారు. అలాగే లింబారావుగూడ నుంచి కెనాల్ మీదుగా సాలెగూడ వరకు బీటీ రోడ్డు, గొల్లగూడలో అంగన్‌వాడీ కేంద్రం, చేతిపంపులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు ప్రకాశ్, జాడి బాపురావు, సుధాకర్, భీంరావు, విలాస్ ఉన్నారు.